సాక్షి చిత్తూరు

ఆదివారం । 29 । అక్టోబర్ । 2023



ఆలయాల మూత

చంద్రగ్రహణం సందర్భంగా శనివారం సాయంత్రం కాణిపాకం, బోయకొండలో ఆలయాలు మూసివేశారు. - 8లో



అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

జిల్లాలో అసాంఘిక శక్తులపై పోలీసులు ఉక్కుపాదం మోపాలని, ఎవరినీ ఉపేక్షించవద్దని ఎస్పీ ఆదేశించారు. - 8లో



బాల్య వివాహాల నిర్మూలన

బాల్య వివాహాలను నిర్మూలించేందుకు ప్రణాళిక అమలు చేస్తున్నట్లు బాలల హక్కుల కమిషన్ చైర్మన్ తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో శనివారం భక్తిశ్రద్ధలతో చండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి, ఉభయదారుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపించారు. ప్రతి నెలా పౌర్ణమి సందర్భంగా నిర్వహించే చండీ హోమంలో పాల్గొనేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పూర్ణాహుతి అనంతరం అమ్మవారి పవిత్ర తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ పోస్టులకు దరఖాస్తులు

చిత్తూరు రూరల్: వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల డ్రైవర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 104, 108 జిల్లా మేనేజర్ ప్రతాప్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ చిత్తూరు, కార్వేటినగరం, పలమనేరు, తిరుపతి పరిధిలో పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు పదో తరగతి ఉత్తీర్ణులైన వారు మంగళవారం లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని 108, 104 కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని కోరారు.

ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ ప్రక్రియ వేగవంతం



ప్రభావతీదేవి, డీఎంహెచ్‌ఓ

చిత్తూరు రూరల్: వైఎస్సార్ ఆరోగ్య శ్రీ యాప్ డౌన్‌లోడ్ చేయించే ప్రక్రియను వేగవంతం చేయాలని డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి ఆదేశించారు. శనివారం ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కింద వలంటీర్లు, వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేస్తున్నారన్నారు. అందులో భాగంగా స్మార్ట్ ఫోన్ ఉన్న వారితో ఆరోగ్య శ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించాల్సి ఉంటుందని వెల్లడించారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించి డౌన్‌లోడింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయించాలని స్పష్టం చేశారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని అన్ని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు ఆదివారం పనిచేస్తాయని ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జెడ్పీ కార్యాలయంలో తనిఖీ



సూచనలిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా పరిషత్ కార్యాలయంలోని పలు విభాగాలను జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈఓ ప్రభాకర్‌రెడ్డి శనివారం తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ కారుణ్య నియమకాల ఫైల్స్ పెండింగ్ లేకుండా చూడాలన్నారు. పనుల మంజూరు, బిల్లులు , కోర్టు ఫైళ్లను సకాలంలో పంపాలని సూచించారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల పీఎఫ్ రికార్డులను మాన్యువల్‌గా తయారు చేయాలని స్పష్టం చేశారు. భవనం పై భాగంలో పెరుగుతున్న పిచ్చిమొక్కలను వెంటనే తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రమ్య, స్టాండింగ్ కమిటీ చైర్మన్ భారతి, ఈఈలు రమణయ్య, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



రోగులకు సాయం

నిరుపేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకానికి శ్రీకారం చుట్టారు. పైసా ఖర్చు లేకుండా ప్రజలకు అత్యున్నత సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ మహోన్నత ఆశయానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరింత మెరుగులు దిద్దారు. సరికొత్త సంస్కరణలను ప్రవేశపెట్టి బడుగులకు ఆరోగ్య భద్రత కల్పించారు. ఇందుకోసం ఏమాత్రం రాజీ లేకుండా రూ.కోట్లు వెచ్చిస్తున్నారు. నాలుగున్నరేళ్లలో జిల్లావ్యాప్తంగా మొత్తం 3.06లక్షల మందికి శస్త్రచికిత్సలు చేయించారు. ఆసరా కింద మరో 1.46 లక్షల మందికి అండగా నిలిచారు.

- పేదల పాలిట సంజీవని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ
- విప్లవాత్మకమైన సంస్కరణలతో విశేష సేవలు
- పథకం పరిధిలోకి మరిన్ని వ్యాధులు
- లక్షలాది మందికి ఉచితంగా శస్త్రచికిత్సలు



ఆరోగ్య మిత్రలతో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్ (ఫైల్)

జిల్లా సమాచారం

సంవత్సరం	సర్జరీల సంఖ్య	ఖర్చు (రూ.కోట్లలో)
2019–20	43,898	96.3
2020–21	51,173	99.72
2021–22	75,941	134.81
2022– 23	1,35,177	281.27(ఇప్పటి వరకు)
మొత్తం	3,06,189	612.10

ఆరోగ్య ఆసరా కింద మొత్తం లబ్ధిదారులు **1.46** లక్షల మంది

వారికి చేకూరిన లబ్ధి రూ.**78.59** కోట్లు

ఆరోగ్యసిరి

సాక్షి, చిత్తూరు : ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం పేదల పాలిట అపర సంజీవనిగా మారింది. అనారోగ్య సమస్యలతో ఆస్పత్రికి వచ్చినవారికి వెంటనే సరైన వైద్య సదుపాయం కల్పిస్తోంది. అవసరమైతే శస్త్ర చికిత్సలను సైతం ఉచితంగా నిర్వహించి రోగులను క్షేమంగా ఇంటికి చేరుస్తోంది. అంతటితో ఆగకుండా ఇంటి వద్ద కూడా పేదల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించేలా కార్యాచరణ అమలు చేస్తోంది.

అన్నీ ఉచితమే..

ఆరోగ్యశ్రీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లాకు ఒక కో–ఆర్డినేటర్, నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సిబ్బంది నియమించారు. వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా వైద్యుల సలహాలు లేదా చికిత్సలు చేయించే బాధ్యతను పూర్తిగా ఆరోగ్యశాఖ తీసుకుంది. వైద్య సహాయం కోసం ఎవరి సిఫార్సులు లేకుండా నేరుగా ఆస్పత్రికి వెళ్లి వైద్య సాయం పొందవచ్చు. ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే ఉచితంగా వైద్య సహాయం అందిస్తారు. గతంలో శస్త్ర చికిత్సలకు ఆరోగ్యశ్రీ ద్వారా అనుమతులు రావాలంటే చాలా ప్రాసెస్ ఉండేది. ఇప్పుడు ఆయా అనుమతులను సులభతరం చేశారు. రోగులు చికిత్స అనంతరం ఇంటికి వెళ్లేందుకు వాహనాలను కూడా సమకూరుస్తున్నారు. ఎవరైనా ఆరోగ్య సాయం కోసం ఇంటి నుంచి 104 కు కాల్ చేసి సమస్యలు వివరిస్తే చాలు, అక్కడి సిబ్బంది మార్గ నిర్దేశం చేస్తారు. ఉచితంగా వైద్యం అందించే ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల వివరాలు అందిస్తారు. నెట్‌వర్క్ హాస్పిటళ్లలోని ఆరోగ్య మిత్ర వివరాలతో పాటు ఫోన్ నంబర్లు కూడా అందిస్తారు. బాధితులు ఆస్పత్రిలో చేరే వరకు బాధ్యత తీసుకుంటారు.

వెంటనే సర్జరీ చేశారు



ఇటీవల తీవ్రమైన కడుపు నొప్పి వచ్చింది. మా పక్క గ్రామంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యులను సంప్రదించా. శస్త్రచికిత్స అవసరమని ఆస్పత్రికి తరలించారు. వెంటనే సర్జరీ నిర్వహించారు. ఆరోగ్య శ్రీ కార్డు ఉండడంతో కుప్పం పీఈఎస్ ఆస్పత్రిలో ఎలాంటి రుసుము లేకుండా ఆపరేషన్ అయిపోయింది. ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నా .

– కుపేంద్ర నాయక్, ననియాల తాండా, రామకుప్పం మండలం

రూపాయి ఖర్చు లేకుండానే..



నాకు 70 ఏళ్లు. నడవడం చాలా ఇబ్బందిగా మారింది. మోకాలికి ఆపరేషన్ చేయాలని వైద్యులు సలహా ఇచ్చారు. దీంతో ఆరోగ్యశ్రీ సిబ్బందిని సంప్రదించాం. చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చేరాలని సూచించారు. ఈనెల 26వ తేదీన శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం బాగానే ఉంది. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఆపరేషన్ చేయడం చాలా ఆనందంగా ఉంది.

– మస్తాన్ బీ, రామనగర్ కాలనీ, చిత్తూరు

ఉచిత వైద్యసేవలు



ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఉచిత వైద్యసేవలు పొందవచ్చు. ప్రజల సౌకర్యం కోసం జిల్లా వ్యాప్తంగా 40 హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశాం. ఆరోగ్య మిత్రలను సంప్రదిస్తే వారు పూర్తి వివరాలు అందిస్తారు. ప్రభుత్వ, నెట్‌వర్క్ ఆస్పత్రులో ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేకుండా చికిత్సలు అందిస్తారు. ఈ మేరకు పకడ్బందీగా పథకాన్ని అమలు చేసేందుకు నిరంతరం పర్యవేక్షిస్తున్నాం.

– రాజశేఖర్ రెడ్డి, జిల్లా ఆరోగ్యశ్రీ అధికారి

అందరికీ ఆరోగ్యరక్షణ



ఆరోగ్యశ్రీ ద్వారా పేదలందరి ఆరోగ్యరక్షణకు ప్రాధాన్యమిస్తున్నాం. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఎంపికైన వారికి వెంటనే అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నాం. డిశ్చార్జి అయిన తర్వాత కూడా ఏడాది పాటు రోగుల ఆరోగ్యాన్ని సంరక్షించేందుకు పక్కాగా చర్యలు చేపట్టాం. రోగులకు సేవలందించడంలో ఆరోగ్య మిత్రలు కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– షణ్మోహన్, కలెక్టర్, చిత్తూరు

'సాధికార యాత్ర' ఏర్పాట్లపై సమీక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరులో నవంబర్ 2వ తేదీన నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్ర ఏర్పాట్లపై శనివారం నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సమీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మురకంబట్టు మీదుగా కట్టమంచిలోని కల్యాణమండపం వరకు యాత్ర కొనసాగుతుందన్నారు. అక్కడ విద్యావేత్తలతో సమావేశం తర్వాత గాంధీ విగ్రహం వరకు యాత్ర వెళుతుందని వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు చేసిన మేలును వివరించేందుకే యాత్ర చేపట్టినట్లు తెలిపారు. యాత్రను విజయవంతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు ఆనందపార్థసారథి, నగర అధ్యక్షులు జ్ఞానజగదీష్, టిమ్ము, టౌన్ బ్యాంకు చైర్మన్ రాంగణేష్, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, పార్టీ గుడిపాల మండల అధ్యక్షుడు జనార్దన్ పాల్గొన్నారు.

కిక్కిరిసిన కాణిపాకం



కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. అల్పిసి మాస పౌర్ణమి సందర్భంగా ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. కాణిపాకానికి చెందిన సల్ల వాసు బ్రదర్స్ ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు చర్యలు చేపట్టారు.

ఆదర్శనీయులు వాల్మీకి మహర్షి

- విగ్రహావిష్కరణలో మంత్రి గుమ్మనూరు జయరామ్
- హాజరైన ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎమ్మెల్సీ భరత్



వాల్మీకి విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే



మాట్లాడుతున్న మంత్రి జయరామ్, చిత్రంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎమ్మెల్సీ భరత్

పెద్దపంజాణి: వాల్మీకి మహర్షి ఆదర్శనీయులని, ఆయన స్ఫూర్తితో యువత సన్మార్గంలో నడవాలని కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పిలుపునిచ్చారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వెంకటేగౌడ సొంత నిధులతో ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహాన్ని ఎమ్మెల్సీ భరత్‌తో కలిసి ఆవిష్కరించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ రామాయణం రచించి తల్లిదండ్రులతో, అన్నదమ్ములతో ఎలా ఉండాలి, కుటుంబ విలువలు, ప్రేమ, నైతిక విలువలపై మానవ జాతికి దిశానిర్దేశం చేసిన మహనీయులు వాల్మీకి మహర్షి అని కొనియాడారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో వాల్మీకుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. కార్పొరేషన్ చైర్మన్లు, మేయర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులుగా వాల్మీకులకు అవకాశం కల్పించారని వెల్లడించారు. అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలకు అండగా పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష కింద ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నారని చెప్పారు. మెరుగైన చికిత్స అవసరమైన వారికి ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల ద్వారా ఉత్తమ వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. వాల్మీకులకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే వెంకటేగౌడ అండగా ఉంటున్నారని వెల్లడించారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా వాల్మీకి మహర్షిని అందరూ పూజించాలని కోరారు. రామాయణం ద్వారా భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలుసుకోవచ్చన్నారు. సమాజంలో నేటికీ సభ్యత, సంస్కారం బతికి ఉన్నాయంటే వాల్మీకి మహర్షి చలవేనని కొనియాడారు. అలాంటి మహనీయుని విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం తమ పూర్వజన్మ సుకృతమని వివరించారు. ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ యోగ విధానాలు, ఆసనాలు, ధ్యాన పద్ధతులను అప్పట్లోనే యోగ వాశిష్ఠం అనే గ్రంథంలో వాల్మీకి రచించారని గుర్తుచేశారు. ప్రపంచానికి సన్మార్గం చూపించిన ఆయన అజరామరుడని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగారెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు జల్లి మధుసూధన్, ఎల్.భాస్కర్, గురుమూర్తి, ఎంబీసీ చైర్మన్ రవి, వాల్మీకి సంఘం నాయకులు సుబ్రమణ్యం, ఆర్డీఓ మనోజ్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు సుష్మకీర్తి, వైస్ ఎంపీపీలు జీడీబాబు, అంజమ్మ, సింగల్‌విండో చైర్మన్ ఓబుల్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, సింగిల్‌విండో మాజీ చైర్మన్ శంకరప్ప, ఎంపీడీఓ అబ్దుల్ రహీం, తహసీల్దార్ లోకేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శులు తమ్మిరెడ్డి, మాకయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఎర్రబల్లి శ్రీనివాసులు, సురేష్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..

చిత్తూరు కలెక్టరేట్ : వాల్మీకి జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి . కలెక్టర్ షణ్మోహన్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ భారతీయ చరిత్రలో సంస్కృత భాషలో పద్యాల రచన రామాయణంతోనే మొదలైనట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రాజశేఖర్, ఏఓ కులశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా నివాళి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా పరిషత్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ రమ్య, స్టాండింగ్ కమిటీ చైర్మన్ భారతి, పీఆర్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, పీఐయూ ఈఈ రమణయ్య, ఎంపీటీసీ సభ్యులు యశోదరెడ్డి పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, డీఆర్‌ఓ రాజశేఖర్

క్లుప్తంగా

బాలికల సైనిక్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : కర్ణాటక రాష్ట్రం, కిట్టూర్ రాణి చెన్నమ్మ బాలికల రెసిడెన్షియల్ సైనిక్ స్కూల్లో 2024-25 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ విడుదలైనట్లు విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన ప్రవేశ పరీక్ష 2024, జనవరి 28న దేశ వ్యాప్తంగా నిర్వహిస్తారని, ఈ పరీక్షకు 2012, జూన్ 1నుంచి 2014, మే 31వ తేదీలోపు జన్మించిన విద్యార్థినులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన సమాచారాన్ని తిరుపతిలోని విశ్వం ఉచిత పోటీ పరీక్షల సమాచార కేంద్రంలో నేరుగానూ, 93999 76999, 86888 88802 ను సంప్రదించాలని ఆయన కోరారు.

తిరుపతి డీఎంహెచ్ఓపై విచారణ

చిత్తూరు రూరల్: తిరుపతి డీఎంహెచ్ఓ శ్రీహరి చిత్తూరు జిల్లాలో పనిచేసే సమయంలో అవినీతి అక్రమాలకు పాల్పడ్డారంటూ వచ్చిన ఫిర్యాదుపై శనివారం చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళితే, డిప్యుటేషన్లు, బదిలీలు, అపాయింట్‌మెంట్‌లు, పోస్టుల భర్తీలో అవినీతికి పాల్పడ్డారంటూ పబ్లిక్, మెడికల్ సొసైటీ కౌన్సిల్ పేరుతో మే 18న ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్‌కు ఉత్తరం వెళ్లింది. దీనిపై స్పందించిన ఆ శాఖ అధికారులు విచారణకు ఆదేశిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. విచారణ అధికారిగా కర్నూలు డీఎంహెచ్ఓ రామగిడ్డయ్యను నియమించారు. ఈ మేరకు ఆయన శనివారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో అధికారుల సమక్షంలో విచారణ చేశారు. కొన్ని రికార్డులను పరిశీలించారు. మెడికల్ సంఘాలను పిలిచి విచారించారు. వారు ఆ ఫిర్యాదుకు తమకు ఎలాంటి సంబంధం లేదని రాత పూర్వకంగా రాసిఇచ్చారు. దీంతో ఫిర్యాదులోని అంశాలను విచారణ అధికారి కొట్టిపడేసినట్లు తెలిసింది.

బాలిక కుటుంబానికి పరామర్శ



బాలిక కుటుంబంతో భరత్‌భాయ్

పెనుమూరు(కార్వేటినగరం): మండలంలోని వేణుగోపాలపురంలో ఇటీవల అనుమానాస్పదంగా మృతి చెందిన బాలిక కుటుంబాన్ని అఖిల భారత సంచార జాతుల అభివృద్ధి మండలి సభ్యుడు భరత్‌భాయ్ పఠాణి శనివారం పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ సంచార జాతులకు చెందిన బాలికకు సంబంధించిన కేసును సుమోటోగా తీసుకుని దర్యాప్తు చేయాలని పోలీసులను ఆదేశించారు.కేసుపై పూర్తి నివేదిక పంపించాలని తహసీల్దార్ కళావతికి స్పష్టం చేశారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ కళావతి, సీఐ బాలయ్య, ఎస్ఐ అనీల్‌కుమార్, మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు జయలక్ష్మి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు



పార్టీలో చేరిన వారితో మంత్రి రోజా

నగరి : నిండ్ర మండలం ఎలకాటూరు గ్రామంలోని 40 కుటుంబాలకు చెందిన టీడీపీ నేతలు శనివారం నగరిలోని మంత్రి రోజా క్యాంపు కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎంపీపీ దీప ఆధ్వర్యంలో విచ్చేసిన టీడీపీ నాయకులు ముత్తమ్మ, విక్రమ్, ప్రియా, మునస్వామి, నందిని, సొరకాయలు, వేద మాణిక్యం, సోము, లక్ష్మి, కాంతారావు, వనజ, చిన్నమ్మాయి, సుందరరాజులు, నిరోషా తదితర నేతలకు మంత్రి రోజా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారు మాట్లాడుతూ జగనన్న పాలనలో మంత్రి రోజమ్మ ప్రతి పథకాన్నీ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ అందిస్తున్నారని కొనియాడారు. అలాంటి వైఎస్సార్‌సీపీ పదికాలాల పాటు ఉండాలని ఆకాంక్షిస్తున్నామని, అందుకే టీడీపీ వదిలిపెట్టి వచ్చేశామని వెల్లడించారు. మంత్రి రోజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనతోనే రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతోందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో సమష్టిగా పనిచేసి అఖండ విజయం చేకూర్చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నిండ్ర వైస్ ఎంపీపీ శుభ, పార్టీ మండల కన్వీనర్ వేణురాజు, సచివాలయాల మండల కన్వీనర్ బాబురెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు విజేష్, సింగిల్ విండో చైర్మన్ మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.



విగ్రహాలను అందిస్తున్న మంత్రి రోజా

పంచలోహ విగ్రహాల వితరణ

పుత్తూరు రూరల్: పట్టణంలోని కామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వర స్వామి వారి ఆలయానికి మంత్రి ఆర్‌కే రోజా రూ.2.50 లక్షలు విలువైన ప్రదోష నంది, ఉత్సవర్ల పంచలోహ విగ్రహాలను శనివారం వితరణగా అందించారు. ఈ సందర్భంగా మంత్రి రోజా ముందుగా నగరిలోని తన నివాసంలో వేద పండితులతో పంచలోహ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పాలకమండలి సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌బాబు, ఎంపీపీలు భార్గవి, దీప పాల్గొన్నారు.

పోలీసు ఆస్పత్రిలో వైద్యశిబిరం



ఎస్పీకి బీపీ చెక్ చేస్తున్న వైద్యసిబ్బంది

చిత్తూరు అర్బన్ : నగరంలోని పోలీసు ఆస్పత్రిలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఎస్పీ రిషాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉంటే సక్రమంగా విధులు నిర్వర్తించగలమని తెలిపారు. పోలీసు సిబ్బంది ప్రతి నెలా తప్పనిసరిగా వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శిబిరంలో పోలీసుల ఆస్పత్రి వైద్యులతోపాటు అపోలో మెడికల్ కళాశాల, లయన్స్ క్లబ్ తరపున డాక్టర్లు సేవలందించడం అభినందనీయమన్నారు. అనంతరం శిబిరంలో ఏర్పాటు చేసిన పలు విభాగాలను పరిశీలించారు. విధుల్లో ఒత్తిడిని అధిగమించేందుకు యోగా, ధ్యానం చేయాలని చెప్పారు. వైద్య శిబిరంలో పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలుకూడా చేస్తారని వివరించారు. అలాగే పోలీసుల రక్తదాన శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు సుధాకర్, శ్రీలక్ష్మి, నాగేశ్వరరావు, డీఎస్పీలు శ్రీనివాసమూర్తి, శ్రీనివాసరెడ్డి, బాబుప్రసాద్, విష్ణు రఘువీర్, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

చిత్తూరు అర్బన్: సమాజంలోని అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాలని, ఉపేక్షించాల్సిన అవసరం లేదని ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆదేశించారు. శనివారం చిత్తూరులోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ రోడ్డుపై ఎక్కడ చూసినా వీలైనంత వరకు పోలీసులు కనిపించేలా డీఎస్పీలు చొరవ చూపాలన్నారు. ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలని, స్టేషన్‌కు వచ్చేవారిని కూర్చోబెట్టి మాట్లాడాలని సూచించారు. అక్రమ మద్యం, సారా, క్రికెట్ బెట్టింగ్, గంజాయి రవాణా నివారించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. చిత్తూరులో ఇటీవల నలుగురు రౌడీషీటర్లపై పీడీ యాక్టు నమోదు చేశామని, ఇదే విధంగా మిగిలిన ప్రాంతాల్లో కూడా కఠిన అణచివేయాలని కోరారు. రాత్రి వేళ గస్తీలను కట్టుదిట్టం చేయాలని, మాదక ద్రవ్యాల వినియోగంతో వాటిల్లే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించేందుకు సన్నద్ధం కావాలని తెలిపారు. న్యాయస్థానాలు జారీ చేసే అరెస్టు వారెంట్లను త్వరగా అమలు చేయాలన్నారు. సైబర్ క్రైమ్ ఉచ్చులో పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అనంతరం సబ్ డివిజన్ల వారీగా చోరీలు, హత్యలు, మిస్సింగ్ కేసులు, దోపిడీలపై సమీక్షించారు. సమావేశంలో ఏఎస్పీలు సుధాకర్, శ్రీలక్ష్మి, డీఎస్పీలు శ్రీనివాసమూర్తి, సుధాకర్‌రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

చంద్రగ్రహణంతో ఆలయాల మూత

చౌడేపల్లి/కాణిపాకం(యాదమరి): చంద్రగ్రహణం కారణంగా జిల్లాలోని కాణిపాకం వరసిద్ధి వినాయ స్వామి, బోయకొండ గంగమ్మ ఆలయాలను మూసివేశారు. శనివారం సాయంత్రం 5 గంటలకు మూసివేశారు. ఆదివారం వేకువజామున 4 గంటలకు ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం, గ్రహణ శాంతి చేసి ఉదయం 6 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించనున్నారు.

నగల దుకాణంలో గొలుసు చోరీ

పుత్తూరు రూరల్: పట్టణంలోని మండీ స్ట్రీట్‌లో ఉన్న లలిత జ్యువెలరీలో శనివారం బంగారు గొలుసు చోరీ జరిగింది. షాపు యజమాని కథనం మేరకు.. ఓ వ్యక్తి బంగారు గొలుసు కొనేందుకు వచ్చాడు. 20 గ్రాముల చైన్‌ను ఎంపిక చేశాడు. యజమాని కళ్లుగప్పి మరో గొలుసును అపహరించాడు. అదే సమయంలో షాపు వద్దకు వచ్చిన బిచ్చగత్తెకు చిల్లర ఇచ్చి వస్తానంటూ బయటకు వచ్చి ఉడాయించాడు. షాపు యజమానికి అనుమానం వచ్చి నగలను సరిచూసుకోగా 20 గ్రాముల బంగారు గొలుసు కనిపించలేదు. సీసీ ఫుటేజీని పరిశీలిస్తే కొనుగోలుదారుడిగా వచ్చిన వ్యక్తి తస్కరించిన విషయం బయటపడింది. దీనిపై బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

పుత్తూరు రూరల్: మండలంలోని తడుకు గ్రామం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. వెస్ట్ బెంగాల్‌కు చెందిన నీలకంఠ(38) కూలి పనుల కోసం తడుకులో నివసిస్తున్నాడు. రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది.

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రణాళిక



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు

చిత్తూరు కలెక్టరేట్ : బాల్య వివాహాల నిర్మూలనకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాలల సంరక్షణ, బాల్య వివాహాల నియంత్రణకు దాదాపుగా 14 శాఖలను సమన్వయం చేసుకుంటూ చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. అందులో భాగంగా సచివాలయాల మహిళా పోలీస్ సేవలను పూర్తిగా వినియోగించుకుంటున్నట్లు వివరించారు. జేసీ శ్రీనివాసులు మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రభుత్వం నిర్దేశించిన బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. బాల్యవివాహాల కట్టడికి నవంబర్ 1వ తేదీ నుంచి క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలోని బంగారుపాళ్యం, కుప్పం, బైరెడ్డిపల్లె, వి.కోట, పలమనేరు, కుప్పం మండలాల్లో ఎక్కువగా బాల్యవివాహాలు నమోదవుతున్నాయని వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లో బాల్య వివాహాల నిషేధ చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ బాల్యవివాహం చేసిన తల్లిదండ్రులు, సంరక్షకులు, కులపెద్దలు, సహకరించిన వారందరూ నేరస్తులే అని తెలిపారు. దిశ డీఎస్పీ బాబు ప్రసాద్ మాట్లాడుతూ మైనర్ బాలికను వివాహం చేసుకుని, సంసారం చేస్తే బాల్య వివాహ చట్టం 2006, పోక్సో చట్టం 2012 (సవరణ చట్టం 2019) ప్రకారం శిక్ష తప్పదని హెచ్చరించారు. అనంతరం పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ నాగశైలజ, డీఆర్‌డీఏ పీడీ తులసి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి చిన్నారెడ్డి, ఆర్డీఓలు చిన్నయ్య, మనోజ్ కుమార్‌రెడ్డి, జిల్లా నైపుణాభివృద్ధి శాఖాధికారి గుణశేఖర్, డీవైఈఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉచితంగా 'మహాప్రస్థానం' వాహన సేవలు



వాహనాలను ప్రారంభిస్తున్న విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: చిత్తూరు నియోజకవర్గ ప్రజల కోసం ఉచితంగా మహా ప్రస్థానం వాహన సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి తెలిపారు. శనివారం కొంగారెడ్డిపల్లెలోని తన కార్యాలయంలో నూతనంగా సిద్ధం చేసిన మహా ప్రస్థానం వాహనాలను నాయన ప్రారంభించారు. అనంతరం విజయానందరెడ్డి మీడియాతో మాట్లాడుతూ ప్రతి మనిషి పుట్టుకతో పాటు అంతిమ యాత్ర కూడా గౌరవంగా నిర్వహించాలనే ఉద్దేశంతోనే మహాప్రస్థానం వాహనాలను తీసుకువచ్చినట్లు వెల్లడించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేరిట స్వర్గరథంగా రెండు వాహనాలు అందుబాటులో ఉంటాయన్నారు. గుడిపాల, చిత్తూరు రూరల్ మండలాల్లో రెండేసి ఫ్రీజర్ బాక్సులను అందించామని తెలిపారు. చిత్తూరు నగరంలో రెండు వాహనాలు, నాలుగు ఫ్రీజర్ బాక్సులను ఏర్పాటు చేశామన్నారు. ఎవరి అంత్యక్రియలకైనా ఈ వాహనాలు, ఫ్రీజర్ బాక్సులను ఉచితంగా ఉపయోగించుకోవచ్చని వివరించారు. వాహన డ్రైవర్ల జీతభత్యాలు, డీజిల్ ఖర్చులు అన్నీ తామే చూసుకుంటామన్నారు. చిత్తూరు లయన్స్ గోల్డ్ సభ్యులకు వాహనాలను అప్పగిస్తున్నామని.. వీటి అవసరం ఉన్నవాళ్లు 9440558378, 9849960994, 9347579734, 9440559559, 8919642747, 9346191235, 6303050910 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్ మధుబాబు, లయన్స్ గోల్డ్ సభ్యులు మల్లికార్జున ఆచారి, ప్రభాకర్, ప్రకాష్ పాల్గొన్నారు.

ఉన్నతంగా ఎదిగేందుకు 'ఓపెన్ స్కూల్'



మాట్లాడుతున్న రవీంద్రనాథ్

చిత్తూరు కలెక్టరేట్ : ఉన్నత చదువులు, ఉద్యోగోన్నతులతో ఎదిగేందుకు ఓపెన్ స్కూల్ ఉపయోగపడుతుందని రాష్ట్ర ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ రవీంద్రనాథ్ తెలిపారు. శనివారం డీఈఓ కార్యాలయంలో ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ కో–ఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ విధానంలో ప్రభుత్వం అనేక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. డీ సెంటర్లతో పాటు గ్రామ, వార్డు సచివాలయాల్లో కూడా అడ్మిషన్ తీసుకునే వెసులుబాటు కల్పించినట్లు వెల్లడించారు. అభ్యర్థుల ఇళ్ల వద్దకే పాఠ్యపుస్తకాలు, సర్టిఫికెట్లు అందజేసే ప్రక్రియను ప్రారంభించినట్లు వివరించారు. ఆయా సర్టిఫికెట్లను ఆధార్‌తో లింక్ చేస్తున్నట్లు చెప్పారు. ఈ విద్యాసంవత్సరంలో పది, ఇంటర్ అడ్మిషన్‌లకు ఈ నెల 31 వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ గురుస్వామిరెడ్డి మాట్లాడుతూ అభ్యర్థుల దరఖాస్తులను పూర్తి చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థుల కుల ధ్రువీకరణ పత్రాలు సేకరించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ కార్యాలయం సూపరింటెండెంట్ రేణుక, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ గుణశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.